# 5

## ఎదురీత

"అబ్బబ్బ! టైములేదండీ—" అనేవాళ్లూ, "నిజంగా మీకు కార్డు రాద్దామని సంవత్సరంనుంచి అనుకుంటు న్నానండీ, కాని తీరిక లేదంటే నమ్మండి" అనేవాళ్లూ పెరిగి పోతున్నారు నేటి నాగరికతలో.

కాలినడకతో మెల్లా మెల్లా నడవడం, ఘంటంతో తాళ పత్రాలమీద గ్రంథాలపై గ్రంథాలు వ్రాయడం, పుస్తకాలకు పుస్తకాలే కంఠస్థం చేయడం, వ్యక్తిగా సంఘజీవిగా తన ధర్మాలన్నిటినీ నిర్వహించడం - ఇన్నీ చేసికూడ కథలనీ కాలక్షేపమనీ నిలకడగా, నిదానంగా జీవించగలిగారు మన పూర్వులు.

పై పనులుగాక ఇంకెన్నిటినో అతిసులభంగా జరిపేసే సాధనాలూ, సదుపాయాలూ ఏర్పడిన ఈ కాలం మనిషికి అబ్బ, ఎంతకాలం మిగిలిపోవాలి, ఎంత తీరిక వుండాలి? కాని ఆశ్చర్యం! పరిస్థితి అందుకు చుక్కెదురుగా వున్నది. 'ఎంచేత' అన్నది ఆధునిక మానవుడి జీవితంలోకెల్లా మహా రసవత్తరమైన ప్రశ్న.

జీవితంలో అది చేయాలి, ఇది సాధించాలి అని ఎన్నెన్నో అనుకుంటాము. కొన్ని చేస్తాము. కొన్ని మరిచిపోతాము. కొన్ని వెనక వుండిపోతాయి. చివరకు సంజవేళ వెనుదిరిగి చూచుకుంటే 'తీరిక' లేక, 'కాలం' చాలక చేయకుండా

మిగిలిపోయిందే చాలా వుందేమో ననిపిస్తుంది. అయ్యో, మరోవిధంగా, ఇంకా శ్రద్ధగా, ఒకపద్ధతిప్రకారం జీవించక పోతిమే అన్న విచారం హిమాలయంలా ఆవరిస్తుంది. ఇదే చేతకానితనాన్ని ఒకరిజీవితంలోని ఒకరోజులో ఇమిడ్చి చూపిద్దామన్న కాంక్ష ఫలితమే ఈ 'ఎదురీత'. ఏ భారత దేశాన్నో 'అంగుళం అంటే అయిదువందల మైళ్లు' అన్న ప్రమాణంలో తయారుచేసిన దేశపటం వంటి దీ కథ.

ఎటువంటి పరిస్థితుల్లో నయినా మానవుడు 'ఆశ'ను కోల్పోకూడదని గ్రుడ్డిగా నమ్మేవాడిని గనక ఈ కథ చివర సంజీవిరావు గడియారంవేపు చూసి నవ్వేసినట్లు వ్రాశాను గాని, ముగింపు మరొకలా వుండివుండాలని ఇప్పు డనిపిస్తున్నది.

ఈ కథలోని వెంకట్రమణయ్యలాంటివారు అక్క డక్కడ కనబడగలరు. జీవితాన్ని కొన్నివేళల పెద్ద జోక్ గానూ, కొన్నివేళల ఘోరంగానూ వుండేటట్లు చేస్తుంటారు వీళ్లు.]

రాత్రిపూట అడవిలోకూసే రైలుఇంజన్‌లా అరిచింది గడియారం. ఉలిక్కిపడి దుప్పటివిదిలించి లేచికూచున్నాడు సంజీవిరావు. ఆరున్నర చూపెడుతూంది వెధవ గడియారం.

'అయిదున్నరకు అలారం పెడితే ఆరున్నరకు మోగుతూంది। హుం.....గడియారంకూడా చెప్పినమాట వినడంలేదు. తానుమాత్రం చచ్చినట్లు దానిమాట వినాలి'—ఈ మాత్రం ఆలోచించేసరికే దుప్పటి మడవడం అయిపోయింది.

అలారం ఆమెనుకూడా లేపింది; కాని ఆమె లేవలేదు. ఆమె లక్ష్మి.

సంజీవిరావు బాత్‌రూములోకి వెళ్లాడు.

పళ్ళుతోముకుంటుంటే గుర్తుకొచ్చింది— ఆమూలపన్ను తీయించి కొత్తది కట్టించుకోవాలని. రెండు నెలలనుండి అనుకుంటున్నాడు. ఏదీ—

అంట్లగిన్నెలతో పనిమనిషి ప్రవేశించింది. చిన్నప్పటి సైన్సు పాఠాలనూ, పత్రికలలో ప్రకటనలనూ మర్చిపోయిన సంజీవిరావు ఆషామాషీగా పళ్లతోమేసుకొని ఇవతలపడ్డాడు.

పడగ్గదిలో కెళుతూ చూస్తే ఇంకా కమల నిద్రపోతూంది. అదృష్టవంతురాలు! అయినా రేప్పొద్దున పెళ్ళయితే ఇలాపడుకోవడం కుదురుతుందా?

రేజర్‌లోకి బ్లేడుని అమరుస్తూ కేకేశాడు సంజీవిరావు.

"లక్ష్మీ! లక్ష్మీ!"

"ఏమండీ?"

"నా అద్దం ఏదీ—?"

"నిన్న నాని పగలగొట్టాడండి!"

"ఊ.... ..."

"ఆ పెద్దద్దంలో చేసుకోండి."

"చిత్తం!....కొంచెం వేడినీళ్ళు......"

లక్ష్మి.మాట్లాడకుండా వేడినీళ్లు తెచ్చిచ్చి వెళ్ళింది. వాతావరణంలో ఏదో బాగులేదనిపించింది సంజీవిరావుకు. దానంతట అదే తెలుస్తుందిలే అనుకున్నాడు.

షేవింగు మొదలెట్టాడు. అద్దంముందు కూచోగానే పసితనం వస్తుంది. నాలుగు దశాబ్దాలనుండి చూసుకుంటున్న మొహమే ఏ రోజుకారోజు క్రొత్తగా వుంటుంది. 'నిజం - తన చిరునవ్వుని అద్దంలో చూచుకుంటే కనపడేది—అందం' అన్నాడు టాగూరు. కుడిచెంపమీదుగా రేజర్ లాగుతున్నపుడు చెవిమీద సన్నగా తెల్లగా కనిపించింది. సబ్బునురగేమో ననుకుని తుడిచాడు. ఊహూ..... పోలేదు. కాస్త వేన్నీళ్ళురాచి తువ్వాలుతో తుడిచాడు. ఆ తెల్లగీత అలాగే వుంది.

"ఓయీ సంజీవిరావూ! సర్పాన్ని చూసికూడా రజ్జువను కుంటే ఎలాగోయ్...అది సబ్బు నురగ కాదు; నెరవనున్న, నెరిసి పోతున్న నీజుత్తు" అనుకున్నాడు. సంజీవిరావు; నవ్వుకున్నాడు.

గడ్డం తెగింది.

అయ్యబాబోయ్—అప్పుడే తల నెరిసిపోవడమా ! శీర్షాసనం వేస్తే జుత్తు నల్లగా వుంటుందంటారు. పొద్దున్నే లేచివేస్తేబావుండును.

పాల సముద్రంమీద ఎర్ర కలువలా సబ్బు నురగమీద నెత్తురుబొట్టు తేలింది. ఇరవై నాలుగ్గంటల కోసారి బ్లేడుతో కలిసి ఆడుకుంటూండడంవల్ల చర్మం మొద్దుబారిపోయింది. నొప్పి తెలియ డంలేదు. నెత్తురుచుక్కని తుడిచాడు సంజీవిరావు. ఎడమచెంప కానిచ్చాడు. మళ్ళీ కుడివైపు ఎర్రబొట్టు తయారయింది. ఎప్పటి కప్పుడే ఇంత బోరిక్ పవుడరూ అదీ తెచ్చి ప్రథమచికిత్స క్కావల సిన మందుల పెట్టెలాంటిది తయారుచేయాలని అనుకోవడం...... కాని—

నిశ్శబ్దంలో మనిషి నాలుకలా 'బొంయ్' మంది మైలు కవతల వున్న మిలు సైరన్.

బాబోయ్! ఏడూ పదిహేనయిపోయింది!

సంజీవిరావు పరుగెత్తుకు వెళ్ళాడు స్నానాలగది దగ్గిరికి.

"లక్ష్మీ! లక్ష్మీ! నీదయిందా.... టైమయిపోతూంది."

"అయిపోయిందండీ!" తడిబట్ట చుట్టుకుని బయటికి వచ్చింది లక్ష్మి. ఆమెవైపు చూశాడు. ఆ నిమిషంలో ఇరవై ఏళ్ళు వెనక్కు వెళ్ళాడు. లక్ష్మి—అప్పుడు సన్నగా విద్యుత్కిరణంలా వుండేది; ఇప్పుడు నిండుగా పున్నమదీపంలా వుంది.

"అలా చూస్తారేమిటి క్రొత్తగా-స్నానం కానివ్వండి."

స్నానం కానిచ్చి వస్తున్నాడు సంజీవిరావు. కమల ఎదు రయింది.

"ఏవమ్మా.... ఇంత ఆలస్యంగా లేచావేం?"

"రాత్రి ఏదో చదువుకుంటూ పడుకునేసరికి పన్నెండు దాటింది నాన్నా—"

"మరయితే నీకు బడి టైమయిపోదూ?"

"ఆ....అయితే అవనీ నాన్నా-వెధవ టైము! మహాఅయితే ఓ సెలవు కాగితం పడేస్తే సరి" అని ఆవలిస్తూ స్నానాలగదివైపు సాగింది కమల.

పుస్తకాలు చదవడం- వెధవటైము-సెలవుకాగితం – ఇవన్నీ ఎక్కడో విన్నట్లనిపించాయి, బట్టలు తొడుక్కుంటున్న సంజీవి రావుకు. హుఁ! 'టై'కి ఎన్ని ముడతలో....ఇస్త్రీ చేస్తే బావుండును. ఇస్త్రీ పెట్టెకూడా వుంది. కాని చేతిగడియారం ఎనిమిది చూపుతూంది.

"టిఫిన్ ఇదిగో...."

"లక్ష్మీ...."

"ఏమండీ...."

"ఏదోలా వున్నావే?"

"ఏమీ లేదండీ!"

"నాని లేవలేదూ!"

"ఇదుగో వెళ్తున్నా....లేపుతాను."

ఉప్మా, కాఫీ అయ్యాయి. ఉప్మాలోని కరివేపాకు ఘుమ ఘుమ, నేతిలోవేగిన జీడిపప్పుల రంగు, రుచి, వేడికాఫీలోని వెచ్చటి కమ్మదనం కనుక్కోకుండానే తినడం, తాగడం అయింది.

"నాన్నా! ఇదిగో పేపరు!" అంటూ నాని వచ్చాడు.

"ఒరేయ్! ఇంతసేపట్రా పడుకోవడం? నేను చూడు— అప్పుడే స్నానం కూడా చేసేశాను."

"నువ్వు ఆఫీసుకు వెళ్తావు నాన్నా."

"ఆరి వెధవా!" అని వాడి నెత్తుకుని ముద్దాడబోయిన సంజీవి రావుకు తెల్లచొక్కా-దాని మడతలూ పాడయిపోతాయన్న తెలివి కలిగి వాడిని క్రిందికి దింపేశాడు. "ఊఁ! అయితే నేను ఆఫీసుకు

పోతాను గనుక ముందు లేచానంటావ్......మరి నువ్వు రేపు విజయ దశమినుండి బళ్ళోకి వెళ్లాలే-అప్పుడూ?''

"ఊఁ, వెళ్తా నాన్నా."

"గుడ్! వెరీగుడ్!" కోటు తొడుక్కున్నాడు సంజీవిరావు. 'షూ'లయితే లేసులు వేసుకుంటూ కూచోవాలని 'స్లిపాన్స్' తొడుక్కున్నాడు.

"నాన్నా! మరే...నన్ను ఎగ్జిమిషన్‌కి తీసుకువెళ్తానన్నావు-ఎప్పుడూ?''

"ఎగ్జి'మి'షన్ కాదురా నానీ! ఎగ్జి'బి'షన్! ఏదీ-అను - అను-ఎగ్జి'బి'షన్!''

"ఎగ్జిబిషన్''

"ఆ...అదీ—భేష్! రోజూ కాసేపు కూచుని ఇంగ్లీషూ అదీ చెప్పించినా బావుండును. అయినా కమల టీచరుకదా-చెప్పకూడదూ?''

"మరి ఎప్పుడు వెళ్దాం నాన్నా!''

"ఓ! వెళ్దాంలేరా అబ్బాయ్, ఆదివారంనాడు వెళ్దాం లే'' ఆదివారంనా డాఫీసులో ఓ స్పెషల్ రిపోర్టు ఏడవ్వాలన్న విషయం సంజీవిరావుకు జ్ఞాపకంలేక కాదు. ఆదివారం మామూలుగా ప్రపంచంలో అన్ని ఆఫీసులకూ సెలవురోజుకదా అని.

"నాన్నా! నా కా డిజైన్లపుస్తకం తెచ్చిపెడతానని పదిరోజుల క్రింద చెప్పావు?"

"ఇవాళ తెస్తాన్లేవే! మీఅమ్మేదీ—లక్ష్మీ! వెళ్తున్నా! ఇవాళ మధ్యాహ్నం హోటలులో భోజనంచేస్తా. కేరియర్ పంపకు.''

సంజీవిరావు హుటాహుటిగా నడిచివెడుతున్నాడు. బస్ స్టాండ్ గడియారం నాలుగు ముఖాలూ కలిపి సరాసరిగా ఎనిమిదీ ఇరవై రెండు చెప్పాయి. అది చూచిన సంజీవిరావు ఇంచుమించుగా పరుగెత్తాడు. ఎనిమిదీ ముప్ఫైయొకటికి ఆవడిస్టేషన్ చేరిన సంజీవిరావు నోరూ ముక్కూ కలిసి పనిచేస్తున్నాయి. అమ్మయ్య! ఇంకో పదినిముషాల్లో రైలురావాలి-గంట ప్రయాణం-సెంట్రల్లోదిగి బస్సె

క్యాలి-మౌంట్ రోడ్ వెళ్ళాలి. ప్రక్కకుతిరిగి, కిల్లీదుకాణం ముందున్న దినపత్రిక తాలూకు పోస్టరు చదివాడు.

"బాంబు ప్రేలుడు-దిగువ కొరియాలో. ప్రధాని హెచ్చరిక భాషా వైషమ్యంపై"

సంజీవిరావు విసుక్కున్నాడు. తనకు రోజూ ప్రొద్దున్నే పత్రికవస్తుంది. కాని ఇలా పోస్టర్లు చదవడం, ట్రెయిన్లో ఎవరి దగ్గరో పుచ్చుకుని చూడడం తప్పదు.

*　　　*　　　*

"సంజీవీ...'సూపర్‌సీడ్' లో 'సి' లేదయ్యా—'ఎస్'వుందీ అని చెప్పలేదూ?" అన్నారు మేనేజరు వెంకట్రమణయ్యగారు తెల్ల తలపాగా క్రింది నల్లకళ్ళ జోడుగుండా చూస్తూ—

"అలాగేనండీ!"

"ఇదంతా నరాల బలహీనతవల్ల వస్తుందోయ్! అందు కేమీ లేదు. ఒక్కడోసు 'నేట్రంమూర్-30 ఎక్స్' వేసుకో! ఆ తర్వాత వన్నదిగిచూడు"

వెంకట్రమణయ్యగారి ప్రక్కవాటాలో హోమియోపతి డాక్టరున్నారు. ఒకానొకరోజు, చదువుకోడాని కేమీ లేకపోతే హోమియోపతి పుస్తకం చదివేసి వారంరోజులు తిరక్కుండానే ఓ పెట్టిమందులు తెప్పించేశారు వెంకట్రమణయ్యగారు. అప్పటినుండీ స్పెల్లింగులు సరిగ్గా వ్రాయడానికీ-అధికారులమీద నిర్లక్ష్యం తగ్గడానికీ-చేతివ్రాత అందంగా కుదరడానికీ-వేగంగా వడవడానికీ కూడా ఆయన హోమియోపతీమందులు ఇవ్వడం మొదలుపెట్టారు. తానుచెప్పి ఎవరయినా కొనక పోయినట్లు తెలిస్తే చాలు మరునటిరోజు తానే ఆ మందు పట్టుకొచ్చి పావలానో, అరణాలో అడిగి పుచ్చుకునేవారు.

సంజీవిలాటి వారు—పన్నెండుమంది, ఆయన చేతిక్రింది గుమాస్తాలు—చచ్చినట్లు పావలా ఇచ్చి ఆమందు నందుకునేవారు. కాస్త తలనొప్పి అదీ వుందని సంజీవిరావు కంటి డాక్టరు కోవిదూ, కళ్ళజోడు కో పాతికా తగలెట్టి తొడుక్కుంటే—"యూఫ్రేసియా, రూటా-జి, లాటి హేమాహేమీ మందులుండగా కళ్ళజోడు వేమ

కుంటావా? ఇసీ! 'హానిమాన్' ఏమంటాడో తెలుసా?'' అని చెవి నిల్లు గట్టుకుని పోరి నెలరోజులు తిరక్కుండా సంజీవిరావుకూ, సులోచనాలకూ విడాకు లిప్పించి తాను మందు లివ్వడం మొద లెట్టారు వెంకట్రమణయ్యగారు. తత్ఫలితంగా సంజీవిరావు ఆఫీసు గుమ్మంలో అడుగుపెట్టగానే కళ్ళజోడు తీసి కోటుజేబులో పెట్టుకుని లోపలికి అడుగువేసేవాడు. కళ్ళజోడు లేకుండా ఆఫీసు కాగితాలు చదువుతుంటే బూజుబూజుగా అనిపించేది. వ్రాస్తుంటే కళ్ళు నొప్పె ట్టేవి. నీళ్ళు వచ్చేవి. వెంకట్రమణయ్యగారు మందు మార్చి మందు ఇస్తుండేవారు. పావలాలు వసూలు చేస్తుండేవారు. "ఇది నీకోసం ప్రత్యేకం కలకత్తానుండి తెప్పించానోయ్!'' అనీ, ''ఏమను కున్నావో....ఇది ఒరిజినల్'బోరిక్ టాఫీల్' వాళ్ళది! 'బోరిక్ టాఫీల్' అంటే ఏవిటో తెలుసా — మీ మిల్క్‌టాఫీ కాదుస్మీ?'' అనీ ఘట్టిగా, పెద్దగా, ఘల్లున నవ్వి—అమెరికా అనే దేశంలో సదరు బోరికుడూ-టాఫీలుడూ అన్న మిత్రు లిద్దరూ ఆ యుగంలో పుట్టా రనీన్నీ, వాళ్ళు పూర్వం అశ్వినీ దేవతలన్నీ, చరకుడూ ధన్వంతరీ వగైరా గుంపంతా వాళ్ళదగ్గర కంపౌండర్లుగా పనిచేస్తుంటా రనీన్నీ వెంకట్రమణయ్య వివరిస్తుంటే—ఆపైన వ్రాసిన వాక్యం వాక్యమేనా, తాను వ్రాసిందేనా అని నమ్మలేక నవ్వలేక వుంటుండేవాడు సంజీవి రావు. వెంకట్రమణయ్యగారి నల్లకళ్ళజోడుని తీసి కెనెడియన్ ఇంజన్ క్రింద పెడదామనికూడా అనిపించేది.

పనిచేస్తున్న గుమాస్తా వెనుకవచ్చి, మాట్లాడకుండా నిల్చో వడం వెంకట్రమణయ్యగారి మరో అలవాటు. ఆయన నీడ తనముం దున్న కాగితం మీద పడుతుంటే—గుమాస్తాకు—జవాబు తెలియక పడికొట్టుకుంటున్న పరీక్ష విద్యార్థి వెనుక వాచర్ నిల్చున్నట్లు అనిపించేది.

"సంజీవిరావుగారూ, మీకు రెండుత్తరా లొచ్చాయి." అందు కున్నాడు సంజీవిరావు.

ఒకటి కాకినాడలో ఇంజనీరింగ్ చదువుతున్న చంద్రశేఖ రంది—''....ఈసారి పెరం జీతంతోబాటు, హాస్టల్‌ది కాకుండా

మరోపాతిక ఎక్కువ పంపించు నాన్నా! మొన్న పిక్నిక్ వెళ్ళి నపుడో స్నేహితుడి కెమెరా పట్టుకెళితే క్రిందపడి ఒక మర విరి గింది. దాని 'రివెటింగ్'కి ఇరవై అవుతుందిట...." అంటే మామూలు వందాఇరవైతో ఇంకో పాతిక!

రెండో వుత్తరం-"....పెద్దయిన ఆడది ఉద్యోగం చేయడం నాకంతగా నచ్చదు. కమల కో సంబంధం చూశాను. కాబట్టి త్వరగా వచ్చి ఇది తేల్చుకుని వెళ్ళు.... కోడలికి ఆశీస్సులు...." అంటారు నాన్నగారు.

ఉత్తరాలను రెండేసిసార్లు చదువుకున్నాడు సంజీవిరావు. మడిచి జేబులో పెట్టుకుంటుండగా ఏదో చేతికి తగిలితే బయటికి తీశాడు. మూడు రోజులనుండి పోస్టుచెయ్యా లనుకుంటున్న కవర్ నవ్వింది.

"ఆ డి. ఓ. ఏమయింది?" వెంకట్రమణయ్యగారి నీడ సంజీవిరావు వీపుమీద పడింది.

"ఇదుగో అయిపోయిందండీ!"

"ఒంటిగంటకు డైరెక్టర్ కేంప్ వెళ్ళిపోతున్నారని తెలుసుగా!"

గడియారం ఒకటి కొడుతూండగా సంతకం చేయించిన డి. ఓ. వుత్తరంతో బయటపడ్డాడు సంజీవిరావు.

ఆఫీసునుండి నడిచాడు.

నడిచి నడిచి చాలాదూరం వెళ్ళాడు.

ఉలిక్కిపడి చేతిగడియారం చూసుకుంటే రెండున్నరయింది ఒంటిగంటనుండి రెండుదాకే 'విశ్రాంతి' సమయం.

'నేడే! 3-3-60: నేడే విడుదల-మహత్తర బృహత్తర....'

ఓ ఇల్లంత బోర్డుమీద మనుషులంత అక్షరాలు చూశాడు సంజీవిరావు!

మార్చి మూడవతేది!

హన్నా! తానెంత మతిమరుపు మనిషయిపోయాడూ! ఇరవై యేళ్ళ క్రితం - ఈరోజు - లక్ష్మి తన జీవితలక్ష్మి అయింది. ఈ ఇరవైయేళ్ళలోనూ ప్రతి మార్చి మూడవతేదీనాడూ తాను ఆఫీసుకు సెలవుపెట్టేవాడు. తనూ, లక్ష్మిపెళ్ళికొడుకూపెళ్ళికూతురూలా అయి, మళ్ళీ ఆ మొదటిరోజు ఆనందంకోసం వెయ్యి వలలు విసిరేవారు. ఆ అనుభూతికోసం పదివేల అయస్కాంతాలతో ప్రయత్నించేవారు. ఆ రోజు ఇంట్లో వంట మానేసి హోటలు కెళ్ళేవారు. సినిమాకో, బీచికో, జూకో, బోటుషికారుకో వెళ్ళేవారు. మొదట కమల, శేఖరం. తర్వాత నానివస్తే వాళ్ళందరితో కలిసి ఆరోజు నొక ఉత్సవదినంగా గడిపేవారు. మార్చి మూడు! సంవత్సరంలో అన్ని పండగలలోనూ పెద్దదయిన పండగరోజు!.... పొద్దున్న లక్ష్మి ముభావానికి కారణం ఇదన్నమాట.... పోనీ తానయినా చెప్పివుండకూడదమా-హుం! తను ఇంటిదగ్గర అన్నిసార్లు వెధవగడియారం కేసి చూశాడే ఒక్కసారి కేలెండరువైపు చూసివుంటే? ఇంతెందుకు - ఆఫీసుకువచ్చి తారీఖు వేసి ఇన్ని వుత్తరాలు వ్రాశాడుకదా అప్పుడుకూడా గుర్తుకురాలేదే — ఏమయిపొయ్యాడు తను? ఏం వచ్చేసింది తనలోకి? జారిపోతున్న ట్లనిపిస్తూంది ఏమిటి?

సంజీవిరావు మథనపడ్డాడు.

మూడయింది. కనీసం ఇప్పుడయినా తిన్నగా ఇంటికివెళ్ళి లక్ష్మిని ఎక్కడికయినా తీసుకువెళితే బాగుంటుంది.

చెమటపోస్తుంటే కోటుబొత్తాలు పైవి రెండూ విప్పాడు. కుడిప్రక్కకు బరువుగా వాలింది కోటు. ఆ ప్రక్కజేబులోని వుత్త రాలు రెంటినీ ఎడమజేబులోకి సర్దాడు సంజీవిరావు.

ఆ కవర్ పోస్టుచేయాలి. అబ్బాయికి డబ్బు ఎక్కువ వంపాలి-ఇవాళ మనియార్డర్ టైమయిపోయింది. వచ్చే ఆదివారంతో కలిపి రెండురోజులు సెలవు పెట్టి వెళ్ళి నాన్నగారు వ్రాసిన ఆ సం బంధం ఏదో చూసి రావాలి. వెళ్ళేముందే పన్ను కట్టించుకోవాలి. అన్నట్టు ప్రథమ చికిత్సపెట్టి తయారుచేసుకోవాలి. అసలు రేపొద్దు న్నుండి ఇంకా ముందు లేవాలి. శీర్షాసనంవేయాలి. పేపర్ చదవాలి.

త్వరగా లేవాలంటే ఆ గడియారం రిపేర్ చేయించాలి! లేదా కొత్తది కొనాలి.

బస్‌స్టాపులో నలభై నిముషాలు నిల్చున్నాడు సంజీవిరావు. ఒక్క బస్సూ రాలేదు. మూడున్నర కావస్తూంది. టాక్సీలో వెళితే? అయ్యబాబోయ్! ఇరవై రెండు మైళ్ళకూ ఏ పదిహూపాయలో అవుతుంది. ఆ పది కింకో పదో పదిహేనో కలిపితే లక్ష్మి కో చక్కటి చీరవస్తుంది. అసలు ముందు తను ఇంటికెళ్ళి లక్ష్మికి చెప్పుకోవాలి. మూడున్నరయిపోయింది.

సంజీవిరావుకు కోపంవచ్చి, వాచీని విప్పి కోటులోపలి జేబులోకి కుక్కేశాడు.

బస్ స్టాపులో జనమేలేరే? ఓహో! ఇవాళ ఆఫీసులున్న దినం! ఇంకా ఆఫీసు లొదిలే వేళ కాలేదు. అన్నట్టు-తను మేనేజర్‌కు ఫోన్ చెయ్యొద్దూ - ఏదో ఒక అబద్ధమాడాలి.

లక్ష్మికి ఏదయినా కొనాలి. ఆమె నెక్కడికయినా తీసుకు వెళ్ళాలి.

కమలకు డిజైన్ పుస్తకం కావాలి.

నానికి ఎగ్జిబిషన్ కావాలి.

తనకు——??

ముందు ఫోన్ చెయ్యాలి.

రోడ్డుదాటి అవతలి హోటల్లో వున్న ఫోన్‌దగ్గరికి వెళ్ళాడు సంజీవిరావు.

"....అవును....హఠాత్తుగా అరటిపండు తొక్కమీద కాలు వెయ్యడంవల్ల జారి క్రిందపడ్డాను. కొద్దిగా దెబ్బతగిలింది. టాక్సీ మీద ఇంటికి వెళ్ళిపోతున్నాను పర్మిషన్ కావాలి...."

"....ఓహో....చిన్న దెబ్బ కదూ.... చర్మం కొంచెం వూడిందా? ఏమీలేదు.... 'ఆర్నికాటించర్'ని పైన రుద్ది, లోపలికి 'లెడంపాల్‌స్టర్' పుచ్చుకో....ఊ.... వెళ్లు వెళ్లు.... ఎర్రవుండు పడ్డ తర్వాత కావలిస్తే 'బెలడోనా-మూడు ఎక్స్'...."

సంజీవిరావు ఫోన్ పెట్టేశాడు. పెడుతూ రోడ్డుమీదకు చూశాడు. గంటసేపటినుండి తాను ఎదురుచూసిన బస్సు, స్టాపులో ఆగకుండా, అర్జునుడి రథంలా వెళ్ళిపోతూంది.

కుర్చీలో కూర్చుండిపోయాడు.

"ఏం కావాలి సార్ !" అని పట్టీని వల్లించి నిల్చున్నాడు సర్వర్.

"ముందు రెండు బాదుషాలూ, ఒక ప్లేటు పకోడాలూ. తర్వాత జీడిపప్పూ, రెండు పెసరట్లూ, ఉప్మా...."

"పార్సిలు కట్టమంటారా—?"

"కాదోయ్ !"

హోటల్ గడియారం నాలుగుకొట్టింది.—తలెత్తి ధీమాగా గడియారం వైపు చూసి నవ్వేశాడు సంజీవిరావు.